International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.3, Issue-11(1), November, 2016
Impact Factor: 4.535; Email: drtvramana@yahoo.co.in

# “వెండి మేఘం” నవలలోని పాత్రల చిత్రణ పరామర్శ

తెలుగు సాహితీ చరిత్ర శతాబ్దాన్ని దాటింది తెలుగు సాహితీ సౌరభాల వెల్లువ తరతరాల్ని అలరించింది, తెలుగు సాహితీ సంపద ఖండాంతర ఖ్యాతిని ఆర్జించింది. ‘దేశ భాషలందు తెలుగు లెస్స’ అన్న మహానుభావుల మహోన్నత వ్యాఖ్య తెలుగు భాషను పరిపూర్ణం గావిస్తుండగా ఎందరో సాహిత్యకారులు నాటి నుండి నేటి వరకు భాషకు భావానికి మధ్య సేతువుల్లా వ్యవహరిస్తూ, రెంటినీ అనుసంధానం చేస్తూ, వైవిధ్యాల్ని సృష్టిస్తూ, విభిన్న కోణాల్ని ఆవిష్కరిస్తూ, తెలుగు సాహితీ వినీలాకాశంలో సాహితీ దివ్యజ్యోతుల్ని వెలిగిస్తున్నారు.

ముఖ్యంగా తెలుగు సాహిత్య ప్రక్రియలు వివిధ మార్పులకు లోనవుతూ తెలుగు ప్రజల సాహితీ చైతన్యాన్ని ఎప్పటికప్పుడు ప్రతిబింబిస్తూ, ఎన్ని ఒరవడులు సృష్టించినప్పటికీ, ఎంత సృజనాత్మకతని గుప్పించినప్పటికీ, తెలుగులో ముస్లిం స్త్రీల జీవితాన్ని యథాతథంగా చిత్రిస్తూ ఒక ముస్లిం రచయిత రాసిన నవల రావడం అనేది “వెండిమేఘం” నవలతో ఆరంభమైంది.

ఆయా ప్రాంతాల్లో ఆయా వర్ణాలకు, మతాలకు, జాతులకు చెందిన వివిధ జీవన స్థితిగతులు, జీవన పరంపరలు ప్రధాన ఇతివృత్తంగా నవలలు వచ్చినప్పుడు అవి ఖచ్చితంగా ఇతర నవలలతో విభేదిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటాయి. వాస్తవికత ఆధారంగా వచ్చే ఈ నవలలు ఆయా సమాజాన్ని ఆలోచింపజేస్తాయి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ముస్లిం జీవితాల్ని చిత్రిస్తూ కొన్ని నవలలు వచ్చినా ఆయా నవలల్లో ముస్లిం జీవితాలకు సంబంధించిన పూర్తి ఆనవాళ్ళు తక్కువే అని చెప్పవచ్చు ఈ నేపథ్యంలో ‘సలీం’ రచించిన ‘వెండిమేఘం’ నవల ముస్లిం జీవన స్థితిగతుల్ని పరిపూర్ణంగా ఆవిష్కరిస్తూ అక్కడి లోటుపాట్లని, కష్ట సుఖాల్ని కళ్ళకు కట్టినట్లుగా చూపెట్టింది. ముస్లిం స్త్రీల బాధల్ని, అనుభవాల్ని, భావోద్వేగాల్ని సజీవంగా ఆవిష్కరించిన సలీంను మైనారిటీ సాహిత్యానికి దార్శనికుడిగా పేర్కొనవచ్చు.

## వెండిమేఘం నవలలోని పాత్రలు

అన్వర్ :

అన్వర్ వెండిమేఘం నవల కథానాయిక ఆదర్శ స్త్రీమూర్తి, అసలు ఇలాంటి వ్యక్తిత్వం ఉన్న స్త్రీమూర్తులు చాలా అరుదు ఇంకా చెప్పాలంటే ఉండరేమో, అన్వర్ ఎంతో అందమైన అమ్మాయి అంతకంటే అందమైన వ్యక్తిత్వం. పెళ్ళంటే తెలీని వయసులో పెళ్ళి అనుకోని పరిస్థితులలో జరుగుతుంది అయినా తన భర్తను భర్తగానే స్వీకరిస్తుంది. మరో ఆలోచన సంఘర్షణ లేకుండా తన అక్కమీద అభిమానం, తన బాబుని కూడా స్వంతకొడుక్కన్నా ఎక్కువగా చూసుకుంటుంది. ఆ బాబు తనని ఎంత అపార్థం చేసుకున్నా కూడా ఒక్కమాట కూడా అనదు కనీసం మనసులో కూడా అలాంటివి అనుకోదు దీన్ని బట్టి చెప్పవచ్చు ఆమె ఎంతటి అమృత తుల్యమైన మాతృమూర్తియో. ఆమె మనసును తెలియచేసేందుకు

ఇంతకంటే మంచి ఉదాహరణ ఆమె చిన్నగా వున్నప్పుడే జరిగిన ఈ సంఘటన ఆధారంగా చెప్పవచ్చు. అది ఆమె చిన్నతనంలో ఎంతో నచ్చిన ముద్ద మందారం పూలను కూడా కోయలేదు అంత మృదువైన మనసు ఆమెది. తన భర్త ఎన్ని చిత్రహింసలు పెట్టినా మౌనంగానే భరించింది తప్ప మాట కూడా అనలేదు. ఇస్లాం మతం అంటే ఎనలేని అభిమానం, నమ్మకం. భర్త చనిపోయినపుడు తనకు మళ్ళీ పెళ్ళి చేసుకునే అవకాశం వచ్చినా, చిన్నవయసే అయినా అందుకు తను ఒప్పుకోదు. అత్తంటే ఎనలేని ప్రేమ. ఒకసారి అంటుంది తన అత్తకు కూడా తానే అమ్మేమో అని. అంత ప్రేమ కలది అన్వర్. భర్త చనిపోతే భయపడకుండా కష్టపడి కుటుంబాన్ని సాకుతుంది. అసలు చదువులేని ఆమె కుటుంబ భారాన్ని మోస్తూనే కష్టపడి చదువుకుంటుంది. భూమిని నమ్ముకుని దాంతో అనుబంధాన్ని ఏర్పరచుకుంటుంది. సమాజంపట్ల అత్తపట్ల, పిల్లలపట్ల, స్నేహితులపట్ల బాధ్యతగా ఉంటుంది. ఆమె పడనటువంటి కష్టం లేదేమో. భర్త అనుమానం, చుట్టూ వున్నవారి అసత్యప్రచారాలు, అత్త, భర్త, సోదరుని మరణం. డబ్బుకోసం, తిండికోసం పోరాటం... అసలు నిజంగా ఆమె స్థానంలో వేరే ఏ స్త్రీ యున్ననూ అంతగా సహించలేరు. ఆదాం దూదేకుల యువకుడు వారి మీద వివక్ష గురించి తెలుసుకుని అన్వర్ వద్దకు వస్తాడు. అప్పుడు ఆదాంకు అన్నీ నేర్పుతుంది, సోదరుని వలే చూసుకుంటుంది. చదువు విషయంలో సాధికారత విషయంలో పోరాటం ఎలా చేయాలో నేర్పుతుంది. తన పిల్లల్ని చదివించేందుకు ఎన్నెన్నో భరిస్తుంది ఒక సాధారణ యువతి అసాధారణ స్త్రీగా ఒక అద్భుతమైన శక్తిగా శక్తిస్వరూపిణిగా మారుతుంది. ఎక్కడా తొందరపడని ఒక నిండుకుండ అన్వర్.

## సలీమున్ :

సలీమున్ అన్వర్ అక్క అందంతో పాటు అణకువ వున్న అమ్మాయి, ఇస్లాం మీద విశ్వాసం అమితం రోజుకు ఐదుసార్లు నమాజు చేస్తుంది ఖురాన్ చదువుతుంది, పెళ్ళి చేసుకున్న తర్వాత భర్త ఎన్ని కష్టాలు పెడ్తున్నా ఒక్క మాట కూడా చెప్పి యెరుగదు. చెల్లెలే అయినా కూతురు వయసున్నందున అన్వర్‌ని చెల్లెలిగా కాకుండా కూతురిలా చూసుకునేది. తనకు పుట్టిన పిల్లలెవరు బ్రతుకట్లేనందున విపరీతంగా దుఃఖించేది. రఫీ "ఛిల్లా" రోజు రఫీ కోసం ఎంతగానో ప్రార్థిస్తుంది. దువా చేస్తుంది. మనిషిగా భూమ్మీద బ్రతకక పోయినా తల్లిగా తన బిడ్డను బ్రతికించాలనుకుంటుంది.

## మీరాసా :

అన్వర్ వాళ్ళనాన్న ఇంటి పెద్ద ఈయనంటే కుటుంబ సభ్యులందరికీ ఎంతో గౌరవం, భయం. దేశ రాజకీయ పరిస్థితులమీద ఎంతో అవగాహన వుంది ఇతనికి తమ పిల్లలందరి మీద ప్రేమ ఎంతగానో వుంటుంది ఈయనకి. తన మనవడు కష్టపడతాడు అనుకోగానే అన్వర్ చిన్నపిల్ల అనుకోకుండా ఆలోచించకుండా, ఒకవేళ ఆలోచించినా బయటపడకుండా అన్వర్‌ని భాషాకిచ్చి పెళ్ళి చేస్తాడు. తన మనవళ్ళ ఖత్నా ఉత్సవం సందర్భంలో నా మనవల కోసం ఈ మాత్రం ఖర్చు పెట్టుకోనా అంటూ అనటం ద్వారా వారిపైన గల ప్రేమను వ్యక్తం చేస్తాడు.

**బాషా :**

సలీమున్ భర్త, భార్య చనిపోగానే మరదలు పెద్దదైందని తెలియగానే అతనిలోని క్రూర ఆలోచనలు, వాటికి తోడు కుటుంబ పరిస్థితులను అడ్డం పెట్టుకుని అన్వర్‌ని పెళ్లి చేసుకునేందుకు తగిన పావులు కదిపాడు. చాలా నీచమైన మనస్తత్వంగలవాడు. సలీమున్, అన్వర్‌నే కాక సైదాబీ అనే స్త్రీని కూడా పెళ్ళి చేసుకుంటాడు. భార్యని అనుమానించటం, అవమానించటమే పనిగా కలవాడు. తల్లి అన్నా కూడా ప్రేమ, మర్యాద లేని వ్యక్తి ఉచ్చం, నీచం ఆలోచించని వ్యక్తి. అన్వర్‌కి, తన బాబాయికి సంబంధం అంటగట్టిన నీచుడు పసిపిల్లాడని కూడా చూడకుండా వాడి భవిష్యత్తేంటి అన్న ఆలోచన కూడా లేకుండా రఫీకి అన్వర్ మీద ఏవేవో నూరిపోశాడు బాషా. జిలానీ కూడా తన కొడుకే అని ఆలోచించకుండా ఆస్థి అంతా రఫీకే చెందాలని చివరికాలంలో పట్టుబడతాడు. బ్రతికున్నంతకాలం అన్వర్‌ని, తన తల్లి కుల్సుంబిని కష్టపెడుతూనే వున్నాడు. ఒక విధంగా చెప్పాలంటే అన్వర్ జీవితాన్ని అలా దారిమళ్ళించిన ఘనత బాషాదే...

**అమీర్ :**

అన్వర్ అన్నయ్యకు అన్వర్ అంటే ఎనలేని ప్రేమ మొదట్లో పనిపాట చేసేవాడు కాదు. కానీ తర్వాత కాలంలో దేశసేవకోసం ప్రాణాలర్పించాడు.

**బద్రుద్దీన్ :**

బద్రుద్దీన్ అన్వర్ పెద్ద అన్న ఒక రకంగా చెప్పాలంటే బద్రుద్దీన్ స్వార్థం "అన్వర్" పెళ్లి బాషాతో జరగడానికి కారణమైంది. అన్వర్ మీద ప్రేమను స్వార్థం ముంచేసింది. కుటుంబానికి చేదోడు వాదోడుగా వుండేవాడు ఇంకో రకంగా చెప్పాలంటే బద్రుద్దీన్ డబ్బు మనిషి.

**జమీలా :**

అన్వర్ చిన్ననాటి స్నేహితురాలు ఒకదశలో చాలా కష్టాలు పడింది అన్వర్ చొరవతో నజీర్‌ను పెళ్లి చేసుకుని ఆనందంగా జీవితం కొనసాగించింది.

**కుల్సుంబి :**

బాషా తల్లి అన్వర్ అత్త, అనేకంటే ఆమెకు స్నేహితురాలు తల్లి అనటం సమంజసమేమో. కొడుకు నీచుడని తెలిసిన తల్లి మొదట అన్వర్‌ని బాషా పెళ్ళి చేసుకోవడాన్ని సమర్థించదు తర్వాత కాలంలో కోడల్ని కూతురుకంటే ఎక్కువగా చూసుకుంటుంది, తన ఆస్థిలో కొంత తన కోడలికి రాసిస్తుంది. కోడలికోసం కొడుకును ఎదిరిస్తుంది. ఒక అత్త ఇలా ఉంటుందా అని అనిపించేలా ఉంటుంది కుల్సుంబి.

**బీబీజాన్ :**

అన్వర్ బాషాని పెళ్లిచేసుకుని వచ్చిన కొత్తలోనే అన్వర్‌కి మంచి స్నేహితురాలయింది అన్వర్ అంటే అభిమానం.

**నజీర్ :**

ఈయన అన్వర్‌కు బావ చిన్నప్పుడు కలిసే పెరిగారు ఇద్దరు అన్వర్‌ని పెళ్లి చేసుకోవాలనుకుంటాడు కానీ బాషాని అన్వర్ చేసుకోవటం అనేది నజీర్‌కు నచ్చదు. కనీసం బాషా చనిపోయిన తర్వాతైనా తనను పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. అన్వర్‌కు జీవితంలో మంచి స్నేహితుడిగా మిగిలాడు చివరికి.

**ఆదాం :**

ఆదాం అన్వర్‌కి తమ్ముని వంటివాడు అన్వర్ వద్దే చాలా విషయాలు నేర్చుకుంటాడు. అన్వర్ అంటే ఎనలేని అభిమానం అన్వర్ క్షేమం కోరేవాళ్లలో ఆదాం కూడా ముందు వరుసలో ఉంటాడు. నూర్ భాషీయుల శ్రేయస్సుకై ఎంతో కృషి చేశాడు ఆజన్మాంతం సమాజానికే అర్పింపబడ్డాడు, తన స్వంత అక్కే అయినా చెడ్డది కావటం వల్ల సైదాబీ అంటే ఆదాంకి ఇష్టం వుండేది కాదు. మంచిస్థాయికి చేరుకుంటాడు తనకంటూ సమాజంలో గుర్తింపు తెచ్చుకున్నాడు.

**సైదాబీ :**

బాషాతో అక్రమ సంబంధం పెట్టుకున్న స్త్రీ. ఆదర్శమూర్తికి నిలువెత్తు నిర్వచనం అన్వర్ అయితే ఆడది ఎలా ఉండకూడదో చెప్పడానికి ఒకే ఒక ఉదాహరణ సైదాబీ, జీవితాలు పాడుచేయటమే పనిగా పెట్టుకున్న స్త్రీ, స్వార్థపరురాలు అవినీతికి నిదర్శం ఈమె ప్రవర్తన. మనసులు విషతుల్యం చేయటం సైదాబీకి వెన్నతో పెట్టిన విద్య.

**ఆదెమ్మ :**

ఆదెమ్మ అన్వర్‌కి మంచి స్నేహితురాలు చదువుకోనిది అన్వర్ అంటే ప్రాణం, అన్వర్‌తో చాలా కాలం స్నేహం చేసిన మంచి స్త్రీ మూర్తి అన్వర్ అత్త కుల్సుంబీ చనిపోయిన తర్వాత ఆదెమ్మ అన్ని విషయాల్లో అన్వర్‌కి తోడుగా వుంది.

**రఫీ :**

సలీమున్, బాషాల కొడుకు సరైన మనస్తత్వం కలవాడు కాదు. అన్వర్‌పైన విపరీతమైన ద్వేషం పెంచుకున్నాడు అన్వర్ ఏది చెప్పినా వినేవాడు కాదు అన్వర్ నుండి ఆస్తిని లాక్కున్నాడు, అన్వర్ వద్దంటున్నా జుబేదాని పెళ్లి చేసుకున్నాడు ఎక్కువ మంది పిల్లల్ని కని కష్టపడ్డాడు.

**జిలానీ :**

అన్వర్, బాషాల కొడుకు మంచి వ్యక్తిత్వం కల పౌరుడిగా ఎదిగాడు తల్లి అంటే ప్రేమ ప్రేమించిన అమ్మాయిది పేదరికం అయినా తననే పెళ్లి చేసుకుంటాడు. చదువుకుని బాగా ప్రయోజకుడైనాడు అన్ని విధాలా మంచి మనిషి.

**రాఘవయ్య పంతులు :**

అన్వర్ పిల్లలకి చదువు చెప్పిన మాష్టారు అతనే అన్వర్‌ని చదివించాడు మంచి వ్యక్తి అన్వర్ జీవితంలో ఎదగడానికి రాఘవయ్య పంతులు ముఖ్యపాత్ర పోషించాడు.

**వెండిమేఘం నవల భాషాశైలి :**

వెండిమేఘం నవల గొప్ప ఆదర్శప్రాయమైన మైనారిటీవాద నవల. సలీం ఈ నవలను ఆద్యంతం ఆసక్తికరంగా, ఆదర్శప్రాయంగా రచించారు. ఈ నవల మైనార్టీవాద నవల అన్న విషయం ప్రక్కన పెడితే ఒక స్త్రీమూర్తి అందరికి ఎలా ఆదర్శప్రాయం కాగలదో చక్కగా వివరించారు. ముస్లిం, దూదేకుల వారు ఎలా సమానంగా ఉండాలో, వివక్ష చూపకూడదన్న విషయాలు స్పష్టంగా తెలియచేశారు సలీం.

ఇంత ప్రాముఖ్యత ఉన్న నవల భాష కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

వెండిమేఘం నవలలోని భాషను పరిశీలన గావించినట్లయితే... ఈ నవల పూర్తిగా అచ్చమైన తెలుగుభాష. అది కూడా సాధారణంగా పుస్తకాలలో మనకు కన్పించే భాషే ఇందులో కన్పిస్తుంది.

నవల వృత్తాంతం మొత్తం ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరిగినట్లు తెలుస్తుంది. కానీ ఆ యాసకాని అక్కడి మాటతీరు, ప్రభావం ఏమీ ఈ నవలపై కన్పించవు. ఈ నవల తెలుగు రాష్ట్రాల్లోని ఏప్రాంతం వారికైనా సులభంగా అర్థమవుతుంది.

ఈ నవల ప్రారంభం...

"పదకొండేళ్ల అన్వర్‌కి చప్పున మెలకువ వొచ్చింది
తన విశాలమైన కళ్లను అరచేతుల్లో అద్దుకుని
"బిస్మిల్లా" అనుకుంటూ మంచం దిగింది."[38]

ఇది మనం గమనించినట్లయితే సాధారణ పుస్తక ప్రామాణిక భాష మనకు కన్పిస్తుంది. ముస్లిం వాళ్లకి సంబంధించిన నవల కావున ఆమె "బిస్మిల్లా" అంటూ అల్లాని తలచుకోవటం అనేది సరైన ప్రారంభంగా చెప్పవచ్చు...

మరో సందర్భంలో

ఆకాశం అరవిరిసిన అనార్ పువ్వులు పరిచినట్లు మనోహరంగా ఉంది.[39]

పై వాక్యాన్ని మనం గమనించినట్లయితే "అనార్ పువ్వులు" అనేపదం మనకు "ముస్లీం" వ్యక్తి తెలుగుమాట్లాడటం అనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. "దానిమ్మ పువ్వులు" అని వాడనందున.

"అన్వర్‌కి అమ్మంటే చాలా ఇష్టం. సలీమున్ ఆపా అన్నా ఇష్టమే".

"అన్వర్ ఒక్క గెంతుగెంతి 'ఆవ్ మేరే మున్నా' అంటూ వాణ్ణి ఎత్తుకోబోయింది".[40]

పై రెండు వాక్యాలను గమనించినట్లయితే "సలీమున్ ఆపా" "ఆవ్ మేరే మున్నా" పదాలు ముస్లీం వ్యక్తులు, బంధుత్వాలు వారి పిలుపులను స్పష్టం చేసేవిగా, హిందీలో కన్పిస్తాయి. ఇంకోదగ్గర, మరో సందర్భంలో...

"అబ్బాజాన్... నేను మంచి అమ్మాయిని కదూ" అని పదే పదే అడిగి, హో బేటి... నువ్వు చాలా బుద్ధిమంతురాలివి" అని వాళ్ల నాన్న మీరాసా చేత పొగిడించుకుని తనలో తనే మురిసిపోయేది..."[41]

పై సందర్భాన్ని మనం పరిశీలించినట్లయితే ముస్లిం కుటుంబాల్లో తండ్రిని పిలిచే "అబ్బాజాన్", తండ్రి పిల్లల్ని పిలిచే 'హో బేటీ' పదాలను మనం గమనించవచ్చు. సలీమున్ బాబు "ఛిల్లా" ఉత్సవం సందర్భంలో జరిగే ఈ సంభాషణ, దాని సారం మనం గమనించినట్లయితే...

"ఇప్పుడిది ఏడో కాన్పు... అందరు పైకి "ఛిల్లా" అని సంతోషంగా కన్పిస్తున్నా, గుండెల్లో గుబులు దాచుకునే ఉన్నారు. ఈ పిల్లాడైనా బ్రతికి బట్టకడ్తాడా అన్న సందేహం అందరి మనసులో... వీడైనా బ్రతికితే దారీ తెన్ను తెలీక కష్టాల కడలిలో తలమునకలౌతున్న సలీమున్‌కి ఓ ఆలంబన దొరుకుతుందన్న ఆశ... యా అల్లా... పర్‌వర్ దిగార్... నా మనవడికి నా ఆయుష్షు కూడా పోసి కాపాడు తండ్రీ అని సలీమున్ వాళ్లమ్మ నమాజ్ తర్వాత పదే పదే దువా చేసింది".[42]

పై వివరణ చూసినట్లయితే ఇప్పుడిది ఏడో కాన్పు, సంతోషంగా కన్పిస్తున్నా, దారీ తెన్ను తెలీక, ఆలంబన వంటి అచ్చమైన తెలుగు పదాలతో పాటు "ఛిల్లా", "పర్‌వర్ దిగార్", దువా మొదలైన ముస్లీంలకు సంబంధించిన పదాలు కూడా కన్పిస్తాయి.

సలీమున్‌కి తేలు కుట్టిన సందర్భంలో సంభాషణ ఈ విధంగా సాగుతుంది.

బాషా కూడా లేచి 'క్యా హువాగే! ఏమైంది అలా అరిచావు?" అని అడిగాడు చిరాగ్గా...

"బిచ్చూ... కాలా బిచ్చూ... మండ్రగబ్బ... కుట్టిందమ్మ" అంది.[43]

పై వాక్యాల్లోని పదాలను మనం గమనించినట్లయితే క్యాహువాగే అంటూ హిందీలో అడుగుతూనే ఏమైంది అంటూ, బిచ్చూ... కాలా బిఛ్చూ అంటూ హిందీలో చెప్తూనే తిరిగి తెలుగులో మండ్రగబ్బ అంటూ తెలియచేయటంవల్ల సులభంగా అర్థమయ్యేలా ముస్లిం, తెలుగు నవలగా సరైన గుర్తింపు వచ్చేలా ఉందనిపిస్తోంది.

ఒకసారి బాషా బద్రుద్దీన్‌తో సంభాషణ జరిపే సందర్భం ఈ విధంగా ఉంటుంది.

"బయటిస్త్రీ ఎవరైనా నాకూ, రఫీకి కష్టాలు తప్పవు" అంటూ ఆగి సిగరేట్ పెట్టె మొత్తం బావమరిదికిచ్చి" "మిగతావి రేపటికి ఉంచుకో" అన్నాడు మరలా నేననేదేమంటే రక్త సంబంధీకులైతే మంచిదని".[44]

పై వాక్యాలను మనం గమనించినట్లయితే పూర్తిగా తెలుగు పదాలే కన్పిస్తాయి ఒక సిగరెట్ అనే పదం తప్ప. ఇలాంటి పదాలు మన నిత్య వ్యవహారంలో ఉన్నవే... మరోసారి బాషా మాట్లాడే సందర్భంలో, ప్రస్తుతానికి బాబు బాగోగులు చూసుకుంటూ... నాకూ, ముసిల్దానికీ ఇంత వండి పడేస్తే, నేను అయిదారేళ్ళ

అమ్మాయిని తాకను. పదే పదే చిన్న పిల్ల, చిన్న పిల్ల అని ఎందుకంటున్నావో నాకు మాత్రం తెలీదా... నేనూ మనిషినే పశువునికాదు... అన్వర్‌తో జాగ్రత్తగా మసులుకుంటాను సరేనా..."[45]

ఇలా మొత్తం అచ్చమైన, అందమైన, అందరికీ అర్థమయ్యే తెలుగులో ఉన్న సంభాషణలు ఎన్నో కన్పిస్తాయి "వెండిమేఘం" లో ఒకసారి కుల్సుంబీ అన్వర్‌తో ఈ విధంగా చెప్తుంది. "రా నా దగ్గర కూచో నీకంతా అర్థమయ్యేలా నేను చెప్తాను. మా బాషా ఉన్నాడు కదా ! ఆడే నీ బావ, నిన్నరాత్రి నిన్ను నిఖా చేసుకున్నాడు నీవిప్పుడు కొత్త పెళ్లికూతురివి, దుల్హాన్ అన్నమాట... ఛోటీ ఛోటీ, ప్యారీ ప్యారీ, గుడియాజైసీ దుల్హాన్ బహూ" అన్వర్ చుబుకం పట్టుకుని అందామె.

"భాయిజాన్ నన్ను నిఖా చేసుకున్నారా? ఎందుకు?
మీ సలీమున్ అపా అంటే నీకిష్టమేనా?
ఓ బోల్డంత ఇష్టం"[46]

పై సంభాషణలో దుల్హాన్ అని, బహూ అని, బాయిజాన్ అని, నిఖా, ఆపా మొదలగు ముస్లీంలకు సంబంధించిన పదాలు కన్పిస్తాయి. కానీ మిగతా సంభాషణ మాత్రం తెలుగులోనే జరుగుతుంది.

మరో సందర్భంలో సంభాషణలు ఇలా ఉంటాయి.

జామచెట్టు కింద ఆడుకుంటున్న రఫీ నాయనమ్మను చూసి

"దాదీ... నేనూ వస్తాను" అన్నాడు.
"ముళ్లుంటాయి బర్ ఖుర్దార్... గుచ్చుకుంటాయి."

నాకు కళ్లున్నాయిగా దాదీ... బాగా కన్పిస్తాయి, నువ్వు ముసలి దానివైనావు కదా... నాకు సరిగా కన్పించవు నీకు ముళ్ళు గుచ్చుకోకుండా నేను దారి చూపిస్తాను అన్నాడు వాడు".[47]

పై సంభాషణలో నాయనమ్మను రఫీ పిలిచే దాదీ అనే మాట కాకుండా మిగిలినవి అన్నీ తెలుగు పదాలు బర్ ఖుర్దార్ అనే మరో పదం కన్పిస్తుంది. ముస్లీంలు వారి బంధుత్వాలను ఎలా పిలుస్తారో ప్రతిమాట చూపించారు.

మరోసారి అన్వర్ తనలో తాను ఇలా అనుకుంటుంది. తన బాధలూ, కష్టాలూ ఎన్నున్నా, ఏమున్నా మరొకరికి చెప్పుకోవాల్సిన అవసరం ఆమెకు కన్పించలేదు ఇది తన జీవితం, తన స్వంతం. ఇందులో మాధుర్యం ఉంటే తనెలా ఆనందంగా ఆస్వాదిస్తుందో కష్టాలూ, కన్నీళ్లు ఉన్నా తనొక్కతే ధైర్యంగా సహిస్తుంది. అంతే తప్ప బేలగా ఏడ్వటమో, మరొకరికి చెప్పుకుని సాంత్వన పొందాలనుకోవడమో చేయదు. అన్వర్ పిరికిది కాదు ఇలా అనుకోగానే ఆమె మామూలైపోయింది.[48]

అన్వర్ తనలో తాను అనుకునే మాటలు అన్నీ అచ్చ తెలుగులో కన్పిస్తాయి...

ఇంకా ఈ నవల మొత్తంలో చాలా హిందీ పదాలే కన్పిస్తాయి అవి గమనించనట్లయితే ఈద్ కా చాంద్, రోజా, రంజాన్, షవ్వాల్, బా, బీబీజాన్, లద్దాఫ్నీ చాలా ఉర్దూ, అరబ్బీ పదాలు కూడా కనిపిస్తాయి. కల్మాలు, సూరాలు, వుజూ, జుబా మొదలగునవి. "చాంద్ కా టుకడా", కవ్వా, మాఫ్ కరనాజీ!, తోబా, ఇలా ఎన్నో పదాలు మధ్య మధ్యలో కన్పిస్తాయి. వెండిమేఘం నవల పూర్తిగా తెలుగులో రాయబడిన నవల, అలాగే ముస్లిం జీవితాలను చిత్రిస్తుంది. కావున ఈ రెండు అంశాలు అద్భుతంగా సమన్వయపరుస్తూ హిందీ, ఉర్దూ, అరబ్బీ పదాలు కన్పించేలా అక్కడక్కడ చిన్న చిన్న ఇంగ్లీషు పదాలు కన్పిస్తూ నవల సంపూర్ణంగా ఉంటుంది.

తెలుగు నవలా సాహిత్యంలో ముస్లింల సాంస్కృతిక నేపథ్యాన్ని విస్తారంగా చర్చించిన మొట్టమొదటి నవల వెండి మేఘం.

పదకొండేళ్ళ వయసులో తనకంటే పాతికేళ్ళు పెద్దయిన వ్యక్తితో నిఖా జరిగిన అన్వర్ అనే పల్లెటూరి, చదువురాని పేద ముస్లిం బాలిక జీవితంలో ఎదుర్కొన్న సాంఘిక, సాంసారిక, రాజకీయ, మతపరమైన సమస్యల్ని, కోస్తాంధ్రలో నివసించే ముస్లింల జీవన విధానాన్ని, ఆచార వ్యవహారాల్ని, సంప్రదాయాల్ని విస్తారంగా చర్చించిన నవల.

ముస్లింలలో మైనారిటీలుగా దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ అవమానాలకు, పరాయీకరణకు గురవుతున్న దూదేకుల దయనియ స్థితినీ, సోదర ముస్లింలు తమను సమానంగా చూడాలని మొదట కోరుకున్న దూదేకులే చివరికి తమది ఓ ప్రత్యేక కులమనీ. తమకు రిజర్వేషన్లు కావాలని ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న చారిత్రక నేపథ్యాన్ని వివరించిన నవల.

ముస్లింల వెనుకబాటుతనానికి పేదరికం, అవిద్య కారణాలని నమ్మి వాటిని అధిగమించడానికి ఓ పల్లెటూరి స్త్రీ మూర్తి చేసిన అవిశ్రాంత పోరాటమే వెండిమేఘం నవలోని ఇతివృత్తం. (సారాంశం)

## ఉపయుక్త గ్రంథాలు :

1) సలీం - వెండి మేఘం నవల (విజయలక్ష్మి పబ్లికేషన్స్ గుంటూరు)
2) డా॥ ద్వానా శాస్త్రి - తెలుగు సాహిత్య చరిత్ర
3) కె.కె. రంఘునాథా చార్యులు - ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు,
(ఆంధ్రా సారస్వత పరిషత్, హైద్రాబాద్)

రచయిత :
**డాక్టర్ మహ్మద్ హుసేన**
ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల
నంగునూరు, సిద్దిపేట (జి)
సెల్ : 9951927456